నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, శనివారం 29 జూన్ 2024 | NIZAMABAD




- నిబంధనలు పట్టించుకోని ప్రైవేట్ విద్యాసంస్థలు
- రోగాల బారిన పడుతున్న చిన్నారులు
- చోద్యం చూస్తున్న అధికారులు

*పుస్తకాల అధిక బరువు పిల్లల పాలిట శాపంగా మారుతున్నది. చిన్నారులపై బండరాళ్లుగా మారుతున్న స్కూల్ బ్యాగులను చూస్తే భయమేస్తున్నది. అంతంత బరువులు ఎలా మోస్తారో ఒక్కోసారి తలుచుకుంటేనే బాధేస్తున్నది. అవసరం ఉన్నా లేకపోయినా వేలాది రూపాయలు వెచ్చించి కిలోల కొద్దీ బరువులను విద్యార్థుల వీపునకు తగిలిస్తున్నారు. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు ఇష్టమొచ్చినట్లుగా పుస్తకాలు అంటగడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలను మోయిస్తుండడంతో విద్యార్థులు రోగాలబారిన పడుతున్నారు.*

*– కామారెడ్డి, జూన్ 28*

# చిన్నారులపై గుదిబండ

## చిట్టి భుజాలపై పుస్తకాల బరువు



**ప్రైవేట్ పాఠశాలల్లో** చదివే విద్యార్థులకు బ్యాగుల భారం తగ్గడం లేదు. వయస్సు, తరగతులకు మించి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో పుస్తకాల భారం మోపుతున్నారు. దీంతో పిల్లలపై మానసికంగా, శారీరకంగా తీవ్ర ప్రభావం పడుతున్నది. ఈ భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాశాఖ 2017 జూలై 19 జీవో నంబర్ 22ను విడుదల చేసింది. జీవోను పకడ్బందీగా అమలు చేయాలంటూ జిల్లా విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు సైతం జారీ చేసింది. మండలాల పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతోపాటు మండల విద్యాశాఖాధికారులతో సమావేశాలు నిర్వహించారు. కానీ ప్రైవేట్ పాఠశాలలు మాత్రం జీవోను తుంగలో తొక్కుతున్నాయి. విద్యను వ్యాపారంగా చేస్తూ విద్యార్థులపై అధిక భారం మోపుతూ పుస్తకాలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పుస్తకాలు విక్రయించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాలు విన్నవించినా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై మండిపడుతున్నారు.

### నిబంధనలు ఇవీ..

విద్యార్థుల బ్యాగు బరువుపై విద్యాశాఖ పలు నిబంధనలు జారీ చేసింది. 1, 2తరగతులు చదివే విద్యార్థుల స్కూల్ బ్యాగు బరువు 1.5 కిలోల లోపు, 3,4,5 తరగతులకు 2 నుంచి 3కిలోల వరకు, 6,7 తరగతులకు 4 కిలోలలోపు, 8,9,10 తరగతులకు 5కిలోల లోపు ఉండాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలున్నాయి. అయినప్పటికీ విద్యార్థులకు వివిధ రకాల మెటీరియల్, సిలబస్‌ల పేరుతో పిల్లల భుజాన మోయలేని భారం మోపుతున్నారు. కొన్ని కార్పొరేట్ పాఠశాలలు అపార్ట్‌మెంట్లలో నడుస్తున్నాయి. దీంతో ఆ బరువైన భారంతో పైకి వెళ్లేందుకు ఆపసోపాలు పడుతున్నారు. తమ పిల్లలు అధిక పుస్తకాల బరువుతో అలసిపోయి అనారోగ్యం పాలవుతున్నారని, భారం తగ్గించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### బరువుకు మించిన భారం..

విద్యార్థి బరువులో బ్యాగు బరువు 10శాతం మించకూడదు. 30కిలోలు ఉన్న విద్యార్థికి 3కిలోల బరువుకు సమానంగా బ్యాగు ఉండాలి. కానీ ఒకటో తరగతి చదివే విద్యార్థి శరీర బరువు 15 కేజీలు ఉంటే పుస్తకాల బరువు 1.5 కిలోలకు బదులుగా 5కిలోల బరువు ఉంటుంది. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి పుస్తకాల బరువు 12 కిలోలు దాటుతున్నది. దాదాపు శారీర బరువు కన్నా 30నుంచి 40 శాతం ఎక్కువగా ఉండడంతో విద్యార్థుల వెన్ను విరుగుతుంది. బ్యాగు బరువు అధికంగా ఉండడంతో ఎముకలు, కండరాల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడుతుంది. మెడ, భుజాలు, వెన్నెముక వంగిపోతున్నాయి. దీంతో చిన్నప్పటి నుంచే వెన్నునొప్పితో బాధపడుతున్నారు.

### ప్రైవేటులో బండెడు పుస్తకాలు..

ప్రైవేట్ పాఠశాల విద్యార్థుల బ్యాగుల్లో రెగ్యులర్ సిలబస్‌తోపాటు అసైన్‌మెంట్, ప్రాజెక్టు వర్క్, స్లిప్ టెస్ట్‌లు, క్లాస్ వర్క్, హోం వర్క్, చిత్తు కాపీ, గైడ్, డైరీ, డ్రాయింగ్, క్రాఫ్ట్, ఆర్ట్, జీకే, కంప్యూటర్ పుస్తకాలు ఉంటున్నాయి. ప్రతి సబ్జెక్ట్‌కు 6 నుంచి 7నోటు బుక్స్ కేటాయిస్తూ విద్యార్థులపై అధిక భారం మోపుతున్నారు. ప్రతిరోజూ ఆయా సబ్జెక్టులు బోధించనప్పటికీ విద్యార్థులు అన్ని పుస్తకాలను మోయాల్సిన పరిస్థితి ఉన్నది.



**అధిక పుస్తకాలు అమ్మిన వారిపై చర్యలు తీసుకుంటాం...**

ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు అధిక పుస్తకాలు అమ్మితే చర్యలు తీసుకుంటాం. గతంలోనే విద్యార్థులపై భారం వేయొద్దని సూచనలు కూడా చేశాం. ఏ తరగతి విద్యార్థికి ఎంత బరువు పుస్తకాలు ఉండాలో సూచించాం. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం.

**- రాజు, డీఈవో, కామారెడ్డి**



**పిల్లల ఎదుగుదలపై ప్రభావం..**

అధిక బరువు మోయడంతో పిల్లలకు మానసికంగా,శారీరకంగా అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నది. ముఖ్యంగా మెడ, వీపు, నడుముపై తీవ్ర ప్రభావం పడుతుంది. చిన్నారుల ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. బరువు నిబంధనలకు లోబడి ఉండేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

**-డాక్టర్ శ్రీనివాస్, పిల్లల వైద్య నిపుణుడు, కామారెడ్డి**



# పదేండ్లు కోతల్లేవ్!

## నేడు మళ్లీ మొదలైనయ్

- కేసీఆర్ హయాంలో 24 గంటలూ విద్యుత్ సరఫరా
- రైతులు, వ్యాపారులకు నాణ్యమైన కరెంట్
- విద్యుత్ ఆధారిత పరిశ్రమలకు తప్పిన ఇబ్బందులు
- నాడు నిరంతరం.. నేడు ఆగమాగం
- కరెంట్ కోతలపై మండిపడుతున్న ప్రజలు



*తెలంగాణ రాకముందు కరెంట్ కష్టాలు చెప్పలనవికాదు. ఎప్పుడు వస్తదో ఎప్పుడు పోతుండెనో కూడా తెలిసేది కాదు..దీంతో రైతులు, చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా విద్యుత్ ఆధారిత పరిశ్రమలు మూతపడే పరిస్థితి ఏర్పడింది. స్వరాష్ట్రం వచ్చాక కేసీఆర్ ప్రభుత్వం కరెంట్ కష్టాలను తీర్చింది. నివాస గృహాల నుంచి పరిశ్రమల వరకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసింది. దీంతో విద్యుత్ కోతల్లేని రాష్ట్రంగా తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలిచింది. స్వరాష్ట్రంలో విద్యుత్ వెలుగులు నింపిన మాజీ సీఎం కేసీఆర్‌పై నిందారోపణలు చేయడం సరికాదని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారు.*

*–కోటగిరి, జూన్ 28*

### కేసీఆర్ మా కష్టాల్ని తీర్చిండు



'ఇరవై ఏండ్లుగా పిండిగిర్ని నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న. తెలంగాణ రాక ముందు కరెంటు కోతలు ఉండడంతో పిండి గిర్ని సరిగా నడిసేది కాదు. కరెంటు వచ్చినప్పుడే గిర్నీ నడిచేది. అయితే ఉదయం.. లేకపోతే సాయంత్రం వేళలోనే పిండిగిర్నికి సంబంధించిన కరెంటు వస్తుండె. సరైన గిరాకీ లేక మస్తు ఇబ్బందులు పడ్డ. తెలంగాణ అచ్చినంకనే కరెంట్ కష్టాలు పోయినయ్. కేసీఆర్ సారు 24 గంటలు కరెంట్ ఇచ్చిం డు. పిండి గిర్ని నడిచేందుకు ఇబ్బంది లేకుండా పోయింది. ఆ సారు ఏం జేసిండో కానీ మా కష్టాల్ని తీర్చిండు. కరెంటు కోతలు అనేవి లేకుండా చేసిండు. ఆయన అధికారంల ఉన్నంత కాలం కరెంటు మస్తుగా ఉండె.

**- సావిత్రి, ఎత్తొండ, కోటగిరి మండలం**

### ఎవుసానికి కరెంట్ కష్టాలు లేకుండే..



కేసీఆర్ సారు అచ్చినంకనే మాకు తిప్పలు తప్పినయ్. తెలంగాణ రాక మునుపు మస్తు కష్టాలు వడ్డం. ఎప్పుడు వస్తుండెనో, ఎప్పుడు పోతుండెనో తెలియక పోతుండె. ఆరు గంటల కంటే ఎక్కువ ఉండక పోతుండె. అది కూడా పొద్దుందాకా మూడు గంటలు. తెల్లందాక మూడు గంటలు. పొలం కాడ్నె పండుకుంటుంటిమి. అచ్చే మూడు గంటల కరెంట్ కోసం తెల్లందాక జాగారం జేస్తుంటిమి. గా బాధలు ఇప్పుడు యాదికస్తే కండ్ల కెళ్లి నీళ్లు అత్తయ్. చానా మంది అప్పట్ల పంటలు ఏసుడే బంద్ జేసిండ్రు. కేసీఆర్ సార్ అచ్చుడితోని మా కష్టాలు దూరమయినయ్. పొద్దుందాక, తెల్లందాక తోట్ల కరెంట్ ఉంటుండె. చీకట్ల పొలం కాడికి పోవుడు తప్పింది. పుళ్ల కరెంట్ ఉండుడు, కాలం మంచిగ అవుతుడుతోని యాట రెండు పంటలు తీసినం. కేసీఆర్ సార్ ఏం జేసిండో కానీ రైతులకు ఎసొంటి కష్టాలు లేకుండా జేసిండు.

**- విశ్వనాథ్, రైతు ఎత్తొండ, కోటగిరి మండలం**

### అధినేతతో భేటీ


*ఎర్రవెల్లిలోని వ్యవసాయక్షేత్రంలో బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌ను ఉమ్మడి జిల్లాకు చెందిన నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. కేసీఆర్‌తో భేటీ అయినవారిలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, హన్మంత్ షిండే, జాజాల సురేందర్ ఉన్నారు.*

*–కామారెడ్డి/ ఆర్మూర్, జూన్ 28*



## దేశ రాజకీయాల్లో అపర చాణక్యుడు పీవీ

### నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



బోర్గాం చౌరస్తాలో పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

సుభాష్‌నగర్ , జూన్ 28 : మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహారావు గొప్ప రాజనీతిజ్ఞుడని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బోర్గాం చౌరస్తా వద్ద తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఇందూరు ఆధ్వర్యంలో పీవీ 103వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా బాజిరెడ్డి గోవర్ధన్ హాజరై పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశంలో ఆర్థిక సంస్కరణలకు పీవీ ఆద్యుడని పేర్కొన్నారు. నగర మేయర్ దండు నీతూకిరణ్ పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కిరణ్‌కుమార్ దేశ్‌ముఖ్, కార్యదర్శి రొట్టె సురేశ్, కోశాధికారి పుల్కల్ రమేశ్, పురుషోత్తం, లక్ష్మీనారాయణ భరద్వాజ్, మేడిచర్ల శ్రీనాథ్, చంద్రశేఖర్ శర్మ, అప్పాల కిష్టయ్య, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## 'ఎస్సెస్సీ సప్లిమెంటరీ' ఫలితాలు విడుదల

### నిజామాబాద్‌లో 81.01, కామారెడ్డిలో 81.30 శాతం ఉత్తీర్ణత

ఖలీల్‌వాడి/ కామారెడ్డి, జూన్ 28: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. నిజామాబాద్ జిల్లాలో 81.01 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు డీఈవో దుర్గా ప్రసాద్ తెలిపారు. మొత్తం 1,490 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా.. 1207 మంది పాసైనట్లు పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లాలో 845 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా..687 మంది ఉత్తీర్ణత సాధించినట్లు డీఈవో రాజు తెలిపారు. మొత్తం 81.30 శాతం మంది విద్యార్థులు పాసైనట్లు పేర్కొన్నారు. రీవెరిఫికేషన్, రీ కౌంటింగ్ కోరే విద్యార్థులు జూలై 8వరకు ఫీజు చెల్లించాలని సూచించారు. రీవెరిఫికేషన్‌కు రూ. వెయ్యి, రీ కౌంటింగ్ రూ. 500 ఉంటుందని వారు తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

### శివలింగంపై నాగేంద్రుడు



*నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పురాతన నాగారం గుట్ట శివాలయంలో శుక్రవారం భక్తులకు ఓ నాగుపాము దర్శనమివ్వడంతో తన్మయత్వం చెందారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు మూడుగంటలపాటు ఆలయంలోని శివలింగంపై పడగ విప్పి ఉన్నట్లు ఆలయ పూజారి శ్రీనివాస్ తెలిపారు.*

*–సుభాష్‌నగర్, జూన్ 28*

## పరిపాలన గాలికి వదిలేసి ఢిల్లీకి చక్కర్లు..



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

వినాయక నగర్, జూన్ 28: సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలన గాలికి వదిలేసి ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నాడని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ్ణ విమర్శించారు. ప్రజా సమస్యలను పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం సీటును కాపాడుకోవడానికి గడిచిన ఆరు నెలల్లో పదకొండు సార్లు ఢిల్లీకి వెళ్లి సోనియా, రాహుల్ చుట్టూ ప్రదక్షిణ చేయడానికి సరిపోయిందన్నారు. విద్యారంగ సమస్యలను గాలికి వదిలేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలికసౌకర్యాలు కల్పించలేని దుస్థితి నెలకొందని తెలిపారు. రేవంత్, భట్టి విక్రమార్క సొంత నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టారని, అర్బన్‌లో ఇంతవరకూ కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. హోం శాఖను తన వద్ద ఉంచుకున్న రేవంత్‌రెడ్డి.. రాష్ట్రంలో శాంతి భద్రతలపై దృష్టి సారించకుండా ప్రశ్నించే గొంతును అణచివేయాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. పార్టీ ఫిరాయింపుల పైన ఉన్న శ్రద్ధ ప్రజల సంక్షేమం, పాలనపై లేదన్నారు. రైతులు వానకాలం పంటల సాగుకు సిద్ధమవుతున్నా ఇంతవరకూ రైతు భరోసాపై స్పష్టత లేదన్నారు. ఇందూరు నియోజవర్గానికి రేవంత్ ఇచ్చింది గాడిద గుడ్డు మాత్రమే అని మండిపడ్డారు.

## స్కూల్ కేటాయించకుంటే ఆమరణ దీక్ష

- ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి
- కిషన్‌రెడ్డిని కలిసిన పైడి
- దీక్షకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి



కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్, జూన్ 28: ఆర్మూర్ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్‌ను కేటాయించాలని, లేకపోతే ఆమరణ దీక్ష చేస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు తన దీక్షకు అనుమతి ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి శుక్రవారం విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం రాకేశ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్‌కు కేటాయించినట్లుగానే ఆర్మూర్ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్‌ను కేటాయించాలని పలుమార్లు ప్రభుత్వాన్ని కోరానని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, ఫైల్ కూడా సిద్ధమైందన్నారు. అయితే, ఆర్మూర్‌కు కేటాయించిన మోడల్ స్కూల్‌ను ఉప ముఖ్యమంత్రి నియోజకవర్గం మధిరకు తరలించుకు పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లల కోసం ఆర్మూర్ నియోజకవర్గానికి మూడో పైలట్ ప్రాజెక్టు కింద ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్‌ను కేటాయించాలని సీఎంను కోరానని తెలిపారు. ఒకవేళ పాఠశాలను మంజూరు చేయకపోతే తాను ఆమరణ దీక్షకు దిగుతానన్నారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని దీక్షకు అనుమతి కోరినట్లు చెప్పారు.